పచ్చదనమా.. నీవెక్కడ!

- ఏటా రూ.లక్షల ఖర్చు
- కానరాని అభివృద్ధి
- కనిపించని పచ్చదనం


గతంలో ప్రధాన రహదారి పక్కనే మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న మున్సిపాలిటీ అధికారులు (ఫైల్)


నేడు సీసీ రోడ్డు నిర్మాణంతో మాయమైన మొక్కలు

రామచంద్రపురం: పట్టణమంతా పచ్చగా మారాలి. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని చేపట్టాలంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఊకదంపుడు ప్రసంగాలే తప్ప అవి ఆచరణలో కనిపించడం లేదు. ఏటా రూ.లక్షల విలువైన మొక్కల పెంపకానికి ఖర్చు చేస్తున్నా అవి వేసవి వచ్చేటప్పటికీ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు కూడా తెలియడం లేదు. వేసవి తాపంతో అల్లాడిపోతున్న పట్టణ వాసులకు కాస్త నీడ దొరుకుతుందేమోనని చూస్తుంటే అస్సలు నీడనేదే లేకుండా పోతుంది.

ఏటా లక్షల ఖర్చు

పురపాలక పరిధిలో మొక్కలు నాటేందుకు ప్రతి ఏటా నెల రోజుల పాటు మొక్కలు పెంపకం కార్యక్రమాన్ని గత ఐదేళ్లుగా నిర్వహిస్తూ వచ్చారు. జూలై, ఆగస్టు నెలల్లో అటవీ శాఖ నుంచి రప్పించిన మొక్కలను పట్టణంలో నాటుతూ ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలను చేశారు. దీని కోసం గత పదేళ్లుగా ఏడాదికి సుమారుగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. మొక్కల దిగుమతిలో పాటుగా, వాటి సంరక్షణకు ఈ సొమ్ములను ఖర్చు చేశారు. ప్రధాన రహదారితో పాటుగా పట్టణంలోని పలు మున్సిపాలిటీ ఖాళీ స్థలాల్లోనూ వీటిని అప్పట్లో అట్టహాసంగా నాటారు. మొదట్లో వాటి సంరక్షణకు ప్రత్యేక ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసినా రాను రాను మున్సిపాలిటీ అధికారులు వాటిని పట్టించుకోవడం మానేశారు. దీంతో లక్షలు వెచ్చించి నాటిన మొక్కలు నేడు కానరావడం లేదు.

సీసీ రోడ్డు నిర్మాణంతో మాయమైన మొక్కలు

రాజగోపాల్ సెంటర్ నుంచి వీఎస్ఎం కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. అయితే ఏడాదిన్నర క్రితం ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా మార్పు చేసిన నేపథ్యంలో ఎదుగుతున్న మొక్కలను నిర్దాక్షిణ్యంగా నరికేశారు. అసలు ఎందుకు మొక్కలు నాటారో.. ఎందుకు తొలగించారో కూడా తెలియని వైనం. చాలా చోట్ల వేసిన మొక్కలను నరికేశారు. ఇలా అసలు లక్ష్యాన్ని మార్చిపోతున్న అధికారులు ప్రజలకు నీడ లేకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధాన రహదారిలో నీడ కరువు

సీసీ రోడ్డు నిర్మాణం పుణ్యాన ప్రధాన రహదారిలో అసలు నీడనేదే లేకుండా పోయింది. మున్సిపాలిటీ అధికారులు వేసిన మొక్కలు అక్కడక్కడ పెద్దవి ఎదుగుతున్న చోటనే పాదచారులు, వాహనదారులు సేదదీరుతున్నారు. సీసీ రోడ్డు వేసే సమయంలో వాటిని నరికి వేస్తే ఉన్న మొక్కలను విద్యుత్ శాఖ అధికారులు తీగలకు అడ్డు వస్తున్నాయనే సాకులతో వాటిని ఎదగకుండానే నరికేస్తున్నారు.

సీసీ రోడ్డుతో పెరిగిన ఎండ తీవ్రత

ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు వేసినప్పటి నుంచి వ్యాపారాలు చేసుకునే షాపుల్లో ఉండలేకపోతున్నారు. ఎండ వేడిమికి సీసీ రోడ్లు వేడెక్కి అటు పాదచారులతో పాటుగా ఇటు రోడ్డు పక్కన ఉండే వ్యాపారస్తులు విలవిలలాడుతున్నారు. ఉదయం 12 గంటలకే షాపులు మూసేసి సాయంత్రం 4 గంటల వరకు తెరవడం లేదు.

మొక్కలను సంరక్షించాలి



ప్రధాన రహదారిలో వేడిమిని తట్టుకునేందుకు మొక్కలు పెంపకాన్ని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా వాటిని మున్సిపల్ అధికారులు సంరక్షించాల్సిన బాధ్యత ఉంది. పట్టణవాసులు విజ్ఞప్తి మేరకు గతంలో మాదిరిగా కాకుండా మొక్కల పెంపకాన్ని ఒక యజ్ఞంలా చేస్తేనే కానీ ప్రధాన రహదారిలో పచ్చదనం రాదు.

– మట్టా బాబులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్

ప్రజాధనం వృథా కాకుండా చూడాలి



మున్సిపాలిటీలో ప్రతి ఏటా మొక్కల పెంపకానికి లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. కానీ హడావుడిగా వర్షాకాలంలో నాటిన మొక్కలు వేసవి వచ్చేనాటికి కనిపించటం లేదు. అలా కాకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– ఇంత సంతోషం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగను అందజేస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో శ్రీకామాక్షి వడ్రంగి యవజన సంఘ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. దాతలు సహకారంతో గత మూడు సంవత్సరాలుగా వేసవిలో మజ్జిగను అందజేస్తున్నారు. చెల్లూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన మనుమలు మజ్జిగను పంపిణీ చేశారు. నాయకులు తామరపల్లి భాస్కరరావు, వేముల శ్రీరామ్మూర్తి, గోడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రైవేటు పాఠశాల్లో నిరుపేద విద్యార్థులకు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండపేట ఎంఈఓలు రామచంద్రరావు, సోమిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా నేటి నుంచి మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 16 నుంచి విద్యార్థులకు పాఠశాలలను లాటరీ ద్వారా కేటాయిస్తారని ఎంఈఓలు తెలిపారు.

అమ్మవారి జన్మదినాన్ని అధికారికంగా నిర్వహించాలి


పసుమర్తి నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏడిద గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ, ఆర్యవైశ్య సంఘం నాయకుడు పసుమర్తి నాగేశ్వరరావు ఆదివారం కోరారు. వైశాఖ దశమి రోజున పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని అమ్మవారి ఆలయంలో నిర్వహించే వేడుకలను దేవదాయ శాఖ ద్వారా చేపట్టాలని కోరారు. ఆ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మానవ వనరుల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ అభివృద్ధి చైర్మన్ రాకేష్‌లకు వినతి పత్రాలను పంపినట్టు నాగేశ్వరరావు తెలిపారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ పూజలు

కపిలేశ్వరపురం: టేకిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ పూజలు ఆదివారంతో ముగిశాయి. ఈనెల 21న ప్రారంభమైన స్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి శ్రీపుష్పయాగం పూజలు చేశారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు హాజరయ్యారు. పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్, భార్గవ్ బ్రహ్మత్వంలో ఉత్సవ పూజలు చేశారు. వార్షికోత్సవ పూజల నిర్వహణకు సహకరించిన గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎల్లారమ్మ తల్లి జాతర


అన్నాయిపేటలో ఎల్లారమ్మ తల్లి

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేట గ్రామదేవత ఎల్లారమ్మ తల్లి జాతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గొల్లాలమ్మ జాతర, తీర్థం


గొల్లాలమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి జాతర సందర్భంగా బుట్టబొమ్మలు, గారడీలు, బ్యాండుమేళాలు, కోయడ్యాన్సులు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర అనంతరం ఆదివారం ఆలయాల వద్ద తీర్థం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఒనుములమ్మ జాతర


సిరిబొమ్మను రాట్నానికి కట్టి చక్కర్లు కొట్టిస్తున్న యువకులు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం, మంజేరు గ్రామాల సరిహద్దులో ఆదివారం ఇరు గ్రామాల ఉమ్మడి గ్రామ దేవత ఒనుములమ్మ జాతర మహోత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది అనంతరం వచ్చే అమావాస్య రోజున అమ్మవారికి జాతర, తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. మంజేరులోని గండివారి ఆడపడుచుగా పిలవబడే ఒనుములమ్మ మొగలిపాలెం, కొత్తమంజేరు, పాతమంజేరు, శీల గ్రామాల ప్రజల నుంచి గ్రామ దేవతగా పూజలందుకుంటుంది. శనివారం రాత్రి మంజేరు గ్రామ వీధుల్లో జాతర నిర్వహించిన నిర్వాహకులు ఆదివారం ఉదయం నుంచి మొగలిపాలెంలో తీర్థం నిర్వహించారు. చివరిగా ఆలయ ఎదుట సిరిబొమ్మను రాట్నానికి కట్టి చక్కర్లు కొట్టించే విధానం తీర్థమహోత్సవాల్లో ప్రత్యేకత సంతరించుకుంటుంది. తీర్థమహోత్సవాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సత్తిబాబు కుటుంబానికి పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం కేపీ రోడ్డులో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మృతి చెందిన మాదాబత్తుల సత్తిబాబు కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పరామర్శించారు. ప్రభుత్వం నుంచి కుటుంబాన్ని ఆదుకొనేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం


మండపేటలో మాట్లాడుతున్న సంఘం జాతీయ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు

కపిలేశ్వరపురం (మండపేట): గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించనున్నట్టు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండపేట పట్టణంలోని సూర్య గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం గ్రామీణ తపాలా ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సర్కిల్ వర్కింగ్ కమిటీ నాయకులు, డివిజనల్, బ్రాంచి కార్యదర్శుల సమావేశం అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, ప్రతినిధులకు సమావేశం ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎస్‌వీవీ మునేశ్వరరావు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. సంఘం జాతీయ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆంధ్ర సర్కిల్ కార్యవర్గం కోర్టు కేసుల్లో ఉన్న కారణంగా రాష్ట్రంలోని ఉద్యోగులంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, బలవంతపు వ్యాపార టార్గెట్లకు బలయ్యారన్నారు. సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి 130 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రెండేళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.

సామాజిక స్ఫూర్తి కలిగిన రచనలే ఆకట్టుకుంటాయి


'ఓ కలం జ్ఞాపకం' వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ తదితరులు

రామచంద్రపురం: సామాజిక చైతన్య స్ఫూర్తి కలిగిన రచనలు పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకుంటాయని గోదావరి కవి వీఎస్ఎం కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ కథా రచయిత వ్యాసకర్త భమిడిపాటి గౌరీ శంకర్ రచించిన వ్యాస సంపుటి 'ఓ కలం జ్ఞాపకం' ఆవిష్కరణ సభలో డాక్టర్ ర్యాలి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని వారణాసి సత్తిబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ 19, 20 శతాబ్దాల నాటి రచయితల రచనల్లోని విశేషాలను ఈ వ్యాస సంపుటిలో తెలియజేసినట్లు వివరించారు. రచయిత భమిడిపాటి గౌరీ శంకర్ మాట్లాడుతూ అనేక పత్రికల్లో వచ్చిన వ్యాసాలను ఒక పుస్తకంగా తీసుకొచ్చే అవకాశం కలిగిందని ఇప్పటివరకు 12 పుస్తకాలు రచించినట్లు తెలియజేశారు. వారణాసి సత్తిబాబు మాట్లాడుతూ గౌరీ శంకర్ రచించిన కథలు వ్యాసాలు ఎంతో విజ్ఞానంతో కూడుకుని ఉంటాయని అన్నారు. విశ్రాంత హెడ్మాస్టర్ వారణాసి శోభావళి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనంద దాయకమని సాధారణమైన శైలిలో అందరిని చదివించగలిగే రచనలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రముఖ కవి ఆర్ వి వి రాజా వ్యవహరించారు. మరొకవి డిటి హేమంత్ సింగ్ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో 15 మంది కవులు పాల్గొని కవిత గానం చేశారు వారందరినీ రచయిత గౌరీ శంకర్ ముఖ్య అతిధి డాక్టర్ ర్యాలి శ్రీనివాసు సత్కరించారు. ప్రముఖ కవులు చాగంటి సుబ్రహ్మణ్యం, గరగ రామకృష్ణ, ఎం వి విఎస్ గోపాలకృష్ణ, కే జనార్ధన స్వామి ,కల్లూరి రాజు డాక్టర్ పి నాగమల్లిక, ఎంకే లక్ష్మి, భూపతి సుమశ్రీ, నాగుల భవాని, బుగత యుమున, బంధకవి శ్రీనివాస రామారావు, మొదలైన కవులు కవితాగానం చేశారు. అనంతరం కవులను సత్కరించారు.

'గాడ్' వైభవం పుస్తకావిష్కరణ


'గాడ్' సమక్షంలో పుస్తకావిష్కరణ చేస్తున్న రచయిత శ్రీను దత్త

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో 'గాడ్' వైభవం పుస్తకావిష్కరణ ఆదివారం విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్య(గాడ్) సమక్షంలో ఆవిష్కరించారు. పిఠాపురం పట్టణానికి చెందిన కోట శ్రీను దత్త 'గాడ్' వైభవం పుస్తకాన్ని రచించారు. తొలుతగా శ్రీను దత్త విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన గాడ్‌ను సందర్శించి, ఆయన సమక్షంలో పుస్తకావిష్కరణ చేశారు. గాడ్ మాట్లాడుతూ విజయదుర్గా అమ్మవారిపై ఉన్న భక్తిప్రపత్తులు, పీఠాధిపతి 'గాడ్'తో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. శ్రీను దత్తను పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనక దుర్గ, పీఆర్వో బాబి తదితరులు అభినందించారు.

జిల్లా ఉత్తమ పశువైద్యాధికారిగా బిందు


జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న బిందు

కె.గంగవరం: మండలంలోని పామర్రు పశువైద్యశాల వైద్యుడు ఎం.బిందు జిల్లా ఉత్తమ పశువైద్యాధికారిగా సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం అమలాపురంలో ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకట్రావు చేతుల మీదుగా బిందు పురస్కారాన్ని అందుకున్నారు. ఆమెను రామచంద్రపురం ఏడీ రామకృష్ణ, మండలంలోని పశువైద్యులు, పశువైద్య సిబ్బంది ఆమెను అభినందించారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో కృష్ణా జిల్లా కలెక్టర్


వేదాశీర్వచనం అందుకుంటున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామికి, మాణిక్యాంబా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్‌ఐ వాసంశెట్టి సత్యదేవ ప్రసాద్, వీఆర్‌ఓ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ద్రాక్షారామలో పగలే దారి దోపిడీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో పగటి పూటే దారి దోపిడీ జరగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సుధాకర్ వేలాయుధం గత మూడు నెలలుగా ద్రాక్షారామ పరిసరాల్లో వరికోత యంత్రంతో కోతలు కోస్తున్నాడు. శనివారం సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో ద్రాక్షారామ నుంచి కోటిపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న పెట్రోలు బంకుకు మోటారు సైకిల్‌పై వరి కోత యంత్రానికి డీజిల్ పట్టుకెళ్లడానికి వచ్చాడు. అదే సమయంలో రెండు మోటారు సైకిళ్లపై వచ్చిన నలుగురు వ్యక్తులు సుధాకర్ వేలాయుధం వద్ద ఉన్న రూ.15 వేలు విలువైన మొబైల్ ఫోను, రూ.10 వేలు నగదు లాక్కుని పారిపోయారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

మహాభారత ప్రవచనాలు


వెలంపాలెంలో మహాభారతం ప్రవచనం చెబుతున్న రాజ్‌కుమార్ మాస్టారు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కొంపెల్ల రాజ్‌కుమార్ మాస్టారు మహాభారత ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతి ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు ప్రవచనం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు అంగర ప్రభాకరాచార్యులు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాంతి భద్రతలు అధ్వానం

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో శాంతి భద్రతలు అధ్వానంగా ఉన్నాయని ఏపీసీసీ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీనారాయణను ఆయన ప్రయాణిస్తున్న కారును టిప్పర్‌తో ఢీకొట్టించి హతమార్చారని ఆరోపించారు. హత్యకు కారకులను చట్ట పరిధిలో శిక్షించాలని కామన కోరారు. ప్రజల్లో పనిచేస్తున్న నాయకులకే భద్రత లేకపోవడం కూటమి ప్రభుత్వ పాలన తీరుకు అద్దం పడుతోందని కామన ఎద్దేవా చేశారు.

పేకాట శిబిరంపై దాడి

రాయవరం: మండలంలోని వి.సావరంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంపై ఎస్సై డి.సురేష్‌బాబు సిబ్బందితో కలసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న వి.సావరం, అనుసూరి శ్రీను, రొంగల వాసులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.1,390 నగదును స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

బీమా సొమ్ము అందజేత

రాయవరం: మండలంలోని వి.సావరంలో బీమా సొమ్మును మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారురాలికి ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన వి.రమణ రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. టీడీపీ సభ్యత్వ బీమా రూ.5 లక్షల సొమ్మును ఎమ్మెల్యే జోగేశ్వరరావు మృతుని భార్య రమణమ్మకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఉన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ వాయిదా

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడినట్లు రామచంద్రపురం ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించినప్పటికీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అందుబాటులో లేని కారణంగా కార్యక్రమం వాయిదా పడినట్లు ఆమె తెలిపారు. ఉపకరణాలు మంజూరైన దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు, రెండు మండలాల ప్రజాప్రతినిధులు గమనించాల్సిందిగా కోరారు.

సంజయ్‌కు గిన్నిస్ రికార్డ్స్‌లో స్థానం



ప్రశంసా పత్రంతో సంజయ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన వీరిన సంజయ్‌కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడు. 2024 డిసెంబర్ 1న విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టీన్ దండంగి నిర్వహించిన కీబోర్డ్ వాయిద్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్టాగామ్ సామాజిక మాధ్యమం ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో 18 దేశాలకు చెందిన వారు పాల్గొన్నారు. వారిలో ప్రపంచ వ్యాప్తంగా 1,046 మంది చిన్నారులను ఎంపిక చేయగా మండపేటకు చెందిన సంజయ్ కుమార్ ఒకరు. సంజయ్‌కు ప్రతిభా పత్రం అందినట్టు ఆయన తండ్రి, ఆర్ఎంపీ వైద్యుడు వీరిన నరేష్‌కుమార్ ఆదివారం తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలి

కాజులూరు: రైతుసేవా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులు నిర్వహిస్తున్న పంట మాసూళ్లను పరిశీలించారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు ప్రభుత్వం రూ.1725 చెల్లిస్తుందన్నారు. బయట మార్కెట్‌లో తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామాల్లో వీఏఏలు, అధికారులు రైతులకు అవగాహన కల్పించి కొనుగోలు వేగవంతం చేయాలన్నారు.

అన్నదాత.. కష్టాల ఆరబోత


పసలపూడిలో రహదారి వెంబడి అన్నదాతలు ఆరబెట్టుకున్న ధాన్యం

రాయవరం: రబీ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. తేమ శాతం తగ్గించుకోవడం కోసం రైతులు పండించిన పంటను రహదారులపై ఆరబోసుకుంటున్నారు. వరికోత యంత్రాల ద్వారా సాగు చేస్తున్న రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రహదారులే దిక్కుగా మారాయి. ఏ రహదారి చూసినా పండించిన పంటతో రోడ్లన్నీ కళ్లాలుగా మారుతున్నాయి.